
సాక్షి పల్నాడు

సోమవారం । 7 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3,007 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1,005 క్యూసెక్కులు వదిలారు.



మణిపూర్ ఘటనపై నిరసన

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ ఆదివారం హోసన్న క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. -8లో▸



కార్తికేయుని సేవలో ఎంపీ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తులకు 10వ తేదీ గడువు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు:మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.నరసింహారావు తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి జరిగే జేఎన్‌వీఎస్‌టీ –2024 పరీక్షను వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించనున్నట్లు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 80 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి వారికి 6 నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తామని పేర్కొన్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యతోపాటు హాస్టల్ ఇతర వసతులను కల్పించనున్నట్లు వెల్లడించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

కలెక్టర్ శివశంకర్ లోతేటి



నరసరావుపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీపై కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఓటర్ల సర్వే తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా తయారీపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ప్రారంభమైన రోల్ బాల్ పోటీలు




గుంటూరువెస్ట్ (క్రీడలు): రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అండర్–11, 17 విభాగాల్లో పోటీలు ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, నెల్లూరు, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, పశ్చిమగోదావరి నుంచి చిన్నారులు పాల్గొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభకనబరిచిన వారిని ఈనెల 14, 15 తేదీల్లో కేరళలోని కొల్లంలో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

సుబ్బారాయుడి నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అభిమానులు రూ. 1,00,116 విరాళంగా అందచేశారు. ఆదివారం వెంకట రమణ పుట్టిన రోజు సందర్భంగా కొక్కిలిగడ్డ ప్రశాంత్ కుమార్ ఫ్రెండ్ సర్కిల్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదానానికి విరాళాన్ని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు అందించారు.

కరువు నేలపై కనకధారలు

ఒకప్పుడు కరువు కరాళ నృత్యం చేసిన ప్రాంతం. గుక్కెడు నీళ్లు దొరక్క అవస్థలు పడిన నేల.. పచ్చని పొలాలూ బీడులై రైతుల ఆత్మహత్యల పరంపరతో ఊళ్లకు ఊళ్లే వలసెళ్లిన కన్నీటిగడ్డ.. ఇప్పుడు కృష్ణానది కనకధారలతో కళకళలాడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విప్లవాత్మక సంస్కరణల నేపథ్యంలో ప్రగతి ఫలాలతో సుభిక్షంగా మారింది. అభివృద్ధి బాటన పరుగులు పెడుతోంది. జయహో జగన్ అంటూ నినదిస్తోంది.

- గురజాల ప్రగతి పరవళ్లు
- గత ప్రభుత్వంలో గుక్కెడు నీరూ కొదవే
- పొలాలూ బీడులే.. ఊళ్లకు ఊళ్లే వలస
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా మారిన స్వరూపం
- రూ.1,500కోట్లపైగా నిధులతో అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల స్వారీ



ఇంటి నివేశన స్థల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి(ఫైల్)

గురజాల : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గురజాల నియోజకవర్గం అభివృద్ధికి అడ్డాగా మారింది. మెరుగైన మౌలిక వసతులతో పల్లెలు కళకళలాడుతున్నాయి. సాగు, తాగునీటికి కొదవ లేకుండా పోయింది. ప్రతి ఇంటికీ కృష్ణాజలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. డెల్టాలో మాదిరి పొలాలు జలసిరులతో సస్యశ్యామలమవుతున్నాయి. వరిసాగు గగనం అనుకున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు పంటలూ పండుతున్నాయి. ఫలితంగా అన్నదాతల మోముల్లో ఆనంద కాంతులు విరుస్తున్నాయి. నవరత్నాలతో గడపగడపలో సంక్షేమసిరులు కురుస్తున్నాయి. పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. విద్యా, వైద్య సదుపాయాలు మెరుగయ్యాయి. పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల అభివృద్ధికి బాటలు పడ్డాయి. ఉన్న ఊళ్లోనే ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. ఫలితంగా వలసలు గణనీయంగా తగ్గాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో ప్రజల జీవన ప్రమాణాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి.

ఇవిగో అభివృద్ధి జాడలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గంలో రూ.1,500 కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చేపట్టారు.

- నియోజకవర్గంలో 18,789 మంది పేదలకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేశారు.
- ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.82 కోట్లు మంజూరు చేశారు.
- మనబడి నాడు–నేడు ద్వారా రూ.73 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించారు.
- పిడుగురాళ్లలోని ఆటోనగర్‌కు రూ.3 కోట్లు ఖర్చుచేశారు.
- జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.52 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.



మనబడి నాడు-నేడు ద్వారా ఆధునికీకరించిన తేనుకుట్ల ప్రభుత్వ పాఠశాల

- సీసీ రోడ్లు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు రూ.30 కోట్లు ఖర్చుచేశారు.
- సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాలకు సుమారుగా రూ.60 కోట్లు కేటాయించారు.
- జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.220 కోట్లతో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు.

బైపాస్ రయ్‌మనేలా..

గత పాలకుల హయాంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మాత్రమే ఉండేది. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలతోపాటు రాకపోకలకు అనుగుణంగా రహదారుల సౌకర్యం ఉండాలని భావించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నడికుడి–మాచర్ల జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ బైపాస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొత్తం 37 కిలోమీటర్ల మేర రూ.403.22 కోట్లతో పనులు చేపట్టింది. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి.



అభివృద్ధే లక్ష్యం



నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గత ప్రభుత్వంలో కేవలం దోచుకో–దాచుకో అన్న సిద్ధాంతంలో పనిచేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి – సంక్షేమం నినాదంతో ముందుకు సాగుతున్నాం. త్వరలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటుచేసి సురక్షిత నీరు అందిస్తాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.

– కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్యే గురజాల

మణిహారం మెడికల్ కళాశాల



వెనుకబడిన గురజాల ప్రాంతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల మంజూరు చేశారు. ఇది ఓ మణిహారంగా మారుతుందనడంలో సందేహం లేదు. గతంలో ఈ ప్రాంతంలో వైద్యసదుపాయాలు అంతంత మాత్రంగా ఉండేవి. ఏ చిన్న రోగమొచ్చినా ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త గ్రామీణ, పట్టణ ఆరోగ్యకేంద్రాలు మెరుగైన వసతులతో అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడికక్కడ ఏరియా వైద్యశాలలు అభివృద్ధి చెందాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయి. దీనికితోడు పిడుగురాళ్ల వద్ద రూ.500 కోట్లకు పైగా నిధులతో వైద్యకళాశాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. వచ్చే ఏడాదికి కళాశాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కొడుకు మృతిని తట్టుకోలేక

సర్పంచ్ కన్నుమూత

- మనస్తాపంతో నిద్రాహారాలు మాని అనారోగ్యానికి గురైన వైనం
- శోకసముద్రంలో కుటుంబ సభ్యులు



సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు (ఫైల్)

గురజాల : తనయుడి మృతిని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తండ్రి నిద్రాహారాలు మాని అనారోగ్యానికి గురై మరణించారు. ఈ దుర్ఘటన గంగవరం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామ సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు నాగేశ్వరరావు గత మంగళవారం అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు తనలో తానే కుమిలిపోతూ మానసిక వేదన అనుభవించారు. నిద్రాహారాలు మాని కుమారుడి స్మృతుల్లోనే గడుపుతూ అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుండె ఆగి పరమపదించారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారం రోజులు తిరగకముందే తండ్రీకొడుకుల మరణంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

సర్పంచ్‌గా మన్ననలు

సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లుది వ్యవసాయ కుటుంబం. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుగా బరిలో దిగి గెలుపొందారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించేవారు. ఉత్తమ సర్పంచ్‌గా గ్రామస్తుల మన్ననలు పొందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కొడుకు నాగేశ్వరరావు గత మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. వారం తిరక్కముందే వెంకటేశ్వర్లు మరణంతో కుటుంబ సభ్యులంతా గుండెలవిసేలా రోదిస్తున్నారు. వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్

- లబ్ధిదారులకు వరంగా మారిన కార్యక్రమం
- వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రజావసరాల గుర్తింపు
- వేగంగా.. సులభంగా.. ఉచితంగా ఇళ్ల ముంగిటకే పౌరసేవలు
- గ్రామసభల్లో 11 రకాల సర్టిఫికెట్ల జారీ



చిలకలూరిపేట సురక్ష శిబిరంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి విడదల రజని (ఫైల్)

యడ్లపాడు: గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు చేరువ చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. దీనిలో భాగంగానే ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం కూడా జిల్లాలో సూపర్ సక్సెస్ అయింది. ప్రజలు ఎక్కడికీ వెళ్లకుండా.. ఎవరి సిఫార్సులు లేకుండా.. పైసా ఖర్చు కాకుండా అవసరమైన పత్రాలు పొందేలా ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న అర్హులకూ లబ్ధి చేకూర్చేందుకు కృషి చేసింది. ఫలితంగా వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. జల్లెడపట్టి మరీ అర్హులకు పథకాలు, సేవలను అందించాలన్న ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ప్రజలు చేతులెత్తి సలాం చేస్తున్నారు.

నెల రోజులపాటు సేవలు

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట

జిల్లాలో జగనన్న సురక్ష ఇలా..	
వలంటీర్లు సందర్శించిన గృహాలు	: 5,47,264
మొత్తం వచ్చిన అర్జీలు	: 1,54,033
పరిష్కరించినవి	: 1,38,490

పట్టణంలోని 9వ వార్డు సచివాలయం నుంచి జిల్లాస్థాయి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్ జూన్ 24న లాంఛనంగా ప్రారంభించారు. మిగిలినచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. జూలై 31 వరకూ జిల్లావ్యాప్తంగా 28 మండలాల్లోని 416 గ్రామ, 122 వార్డు సచివాలయాల్లో మొత్తం 538 గ్రామ సభలను అధికారులు విజయవంతంగా నిర్వహించారు.

ఎక్కువగా రెవెన్యూ అర్జీలు పరిష్కారం

తొలుత వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలో ఉన్న కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాలు అందాయా లేదా అన్న వివరాలతోపాటు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు కావాల్సిన వారిని గుర్తించి అర్జీలు తీసుకున్నారు. జిల్లాలోని 538 సచివాలయాల పరిధిలో 10,770 మంది వలంటీర్లు 5,67,808 గృహాల సర్వే పూర్తిచేశారు. ప్రజల నుంచి 1,54,033 ప్రజా వినతులను సేకరించారు. వీటిలో 1,43,755 అర్జీలను అధికారులు పరిశీలించి 1,38,490 వినతులను పరిష్కరించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు ఉచితంగా అందించారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై విచారణ జరుగుతోంది. పరిష్కరించిన వాటిలో రెవెన్యూ అర్జీలు 1,26,119, సివిల్ సప్లయిస్ 4,534, జీఎస్‌డబ్ల్యూ అర్జీలు 994, రూరల్ డెవలప్‌మెంట్ 155 వినతులు ఉన్నాయి. ఆధార్– 5,129, వ్యవసాయశాఖ– 1,238, వైద్యారోగ్యశాఖకు చెందిన 321 సమస్యల్ని కూడా 100 శాతం పరిష్కరించడం విశేషం.

ఎదురు చూపులేదు.. పైసా ఖర్చులేదు...



ఇటువంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ చూడలేదు. వలంటీర్లే ఇళ్లకు వచ్చారు. మాకు కావాల్సిన సర్టిఫికెట్ల వివరాలు అడిగారు. కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరమని చెప్పాను. అర్జీ కూడా తనే రాసి సచివాలయంలో ఇచ్చాడు. అక్కడి నుంచి టోకెన్ తెచ్చి గ్రామసభ రోజున సచివాలయం వద్దకు రమ్మన్నారు. అక్కడికి వెళ్లగానే వెంటనే సర్టిఫికెట్లు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు కృతజ్ఞతలు.

– ప్రత్తిపాటి లక్ష్మీకామేశ్వరీ, లింగారావుపాలెం

సురక్ష సేవా యజ్ఞం



రెవెన్యూ శాఖ ద్వారా ఏదేని ధ్రువీకరణ పత్రం పొందాలంటే మీ–సేవ లేదా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకుని, నిర్దేశిత ఫీజు చెల్లిస్తే ధ్రువ పత్రం మంజూరుకు కొంత సమయం పడుతుంది. జూన్ 24 నుంచి జూలై 31 వరకు జిల్లాలో 97శాతం గృహాల సర్వే నిర్వహించాం. వలంటీర్ నుంచి జిల్లా అధికారుల వరకు అందర్నీ సమన్వయం చేశాం. సమయం, డబ్బు ఆదా అయ్యేలా వారి ముంగిటనే శిబిరం నిర్వహించి ఉచితంగా ధ్రువపత్రాలు అందజేశాం. ఒకే నెలలో లక్షల మందికి అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయడం ఓ రికార్డు.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణతో అభివృద్ధి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: రైల్వే స్టేషన్ల ఆధునికీకరణతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి బాటలు పడతాయని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రూ.19.3 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో శిలాఫలకాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రవాణా సదుపాయాల మెరుగుకు ప్రైవేట్ బోగీలకు టెండర్లు ఆహ్వానిస్తున్నారని చెప్పారు. మాచర్ల ప్యాసింజర్ రైలులో వసతులు లేవని తన దృష్టికి రావడంతో రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ నెల 5వ తేదీ నుంచి సౌకర్యాలు కలిగిన రైలును అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వెల్లడించారు. కొండమోడు–పేరేచర్ల రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభవుతాయని వివరించారు.

ప్రగతిబాటలో పిడుగురాళ్ల

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పిడుగురాళ్ల ప్రగతి బాటలో పరుగులు పెడుతోందని చెప్పారు. పట్టణాన్ని రూ.912 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రూ. 19.3 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునికీకరణ జరుగుతుందని వివరించారు. పట్టణంలోని చెరువు అభివృద్ధికి రూ. 11 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. మొత్తం రూ.942.3 కోట్లతో పిడుగురాళ్ల అతివేగంగా పురోగమిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులకు ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, రైల్వే సీనియర్ డీసీఎం ఎం.దినేష్‌కుమార్, కె. కమలాకర్‌బాబు, రైల్వే బోర్డు మెంబర్ మద్దాలి సుబ్బయ్య, ఏపీఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ చింతా వెంకట రామారావు, మార్కెట్‌యార్డు చైర్మన్ కామెర వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, సీనియర్‌నాయకులు భవనాసి యల్లారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, షేక్‌జైలాబ్దీన్, రైల్వే అధికారులు డీఎస్‌టీఈ లక్ష్మణ్, ఏడీఈఎన్ సుధాకర్‌బాబు, ఏఎస్ఈ బి.శైలేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 861.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 35,837 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నేటి నుంచి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్–2023)లో అర్హత సాధించి, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈనెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ఉంది. ఆప్షన్లను మార్చుకునేందుకు ఈనెల 13 చివరి తేదీ. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఈనెల 17న సీట్ల కేటాయింపు జరపనుంది. ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసిన సాంకేతిక విద్యాశాఖ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదుకు అవకాశం ఉండగా, ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతోపాటు హెల్ప్‌లైన్ కేంద్రాలకూ వెళ్లవచ్చు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతోపాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 25వేల మందికి పైగా ఉన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం
- హోసన్నా మినిస్ట్రీస్, కృపా మినిస్ట్రీస్, ఏఈఎల్‌సీ, ఇతర క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో భారీ శాంతిర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

నెహ్రూనగర్: సభ్యసమాజం సిగ్గుపడేలా మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం బాధాకరమని, మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంతో పాటు ఈ సంఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని పలువురు క్రైస్తవ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న మారణకాండలను నిరసిస్తూ ఆదివారం హోసన్నా మినిస్ట్రీస్, కృపా మినిస్ట్రీస్, ఏఈఎల్‌సీ, ఇతర క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని లాడ్జిసెంటర్ నుంచి ఏసీ కాలేజీ మీదుగా నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్ వరకు భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ మణిపూర్ సంఘటన బాధితులకు క్రైస్తవులంతా అండగా ఉంటారన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత్‌లోనే ఇలాంటి అమానుష సంఘటనలు జరగడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం శుభపరిణామన్నారు. కృపా మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ మాథ్యూస్ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి కలుగ జేసేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులను కొట్టి చంపడం విచారించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా కేంద్రం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్ ఘటనకు వేలాది మంది క్రైస్తవులు మద్దతు తెలియజేయడం అభినందనీయమన్నారు. క్రైస్తవ సంఘ సమాఖ్య కన్వీనర్ ఈరి రాజశేఖర్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ హక్కులను కాపాడాలని కోరారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మోజేస్ ఆర్నాల్డ్, లెనిన్, పృథ్వీరాజ్, రంజిత్, వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

ఐదు సంవత్సరాల సర్వీసు నిబంధన సడలించాలి

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

రెంటచింతల: ఉపాధ్యాయుల్ని రెగ్యులరైజేషన్ చేయడానికి 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీసు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధన సడలించాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 10,200 మందిని రెగ్యులరైజేషన్ ముందుగా నిర్ణయించిందని, అయితే ఐదు సంవత్సరాల సర్వీసు ఉండాలని పెట్టిన నిబంధన కారణంగా నాలుగు వేల మంది నష్టపోతున్నారని తెలిపారు. నిబంధన తొలగించి నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. 1998 డీఎస్సీ అభ్యర్థుల్లో 6,800 మందిలో 4,072 మందికి మాత్రమే ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మిగిలిన 2,728 మందికీ కూడా ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. రాష్ట్రంలో 25 వేలకు పైగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఈడీ, డీఈడీ చేసిన ఐదు లక్షల మంది డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 350 కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస టైంస్కేల్ ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు. రెంటచింతల మండలంలో ప్రస్తుతం మూడు జెడ్పీ పాఠశాలలు ఉన్నాయన్నారు. మండల కేంద్రంలో కూడా జెడ్పీ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో తీర్మానం చేసి ప్రతిపాదించినట్లు వెల్లడించారు. మాచర్ల, గురజాల, వినుకొండ నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్ని తాత్కాలికంగానైనా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ మండల శాఖ నాయకులు ఎం.బి. చిన్నమ్మ, ఆదూరి మేరి జోస్ఫినా, రాజ్ కుమార్, ఓర్సు సాగర్, సీహెచ్. నాసరయ్య, బిల్లా ప్రతాప్, రమాచారి పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఐదు మండలాల్లో వర్షం కురిసింది. తెనాలి మండలంలో అత్యధికంగా 24 మిల్లీ మీటర్లు వర్షం పడగా, కొల్లిపర మండలంలో 15.2 మి.మీ., చేబ్రోలు 3.2, పెదనందిపాడు 1.8, పొన్నూరు మండలంలో 1.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

సున్నా వడ్డీతో సుస్థిర జీవనోపాధి

- స్వయం సంఘాలకు ఉజ్వల భవిష్యత్
- వరుసగా నాలుగో ఏడాది అమలు కానున్న వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం
- త్వరలో జిల్లాలోని 4,24,599మందికి లబ్ధి


నరసరావుపేట పట్టణంలోని 31వ వార్డులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

నరసరావుపేట: స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మల ఉజ్వల భవిష్యత్‌కు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం పట్టణ, గ్రామాల్లో చేదోడుగా నిలుస్తోంది. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది.డ్వాక్రా సంఘాల మహిళల కోసం 2020 నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇప్పటికీ మూడు విడతలుగా అమలు చేసిన ఈ పథకాన్ని నాలుగోసారి ఈనెలలో అమలు చేయనున్నారు.

జిల్లావ్యాప్తంగా రూ.58కోట్ల లబ్ధి

- పల్నాడు జిల్లావ్యాప్తంగా 39,914 డ్వాక్రా సంఘాల్లో 4,24,599మంది సభ్యులున్నారు.
- వీరికి నాలుగో విడతగా రూ.58.02 కోట్ల లబ్ధి చేకూరనుంది.
- ఇందులో గ్రామాల్లోని 33,507 సంఘాల్లో ఉన్న 3,59,214మంది సభ్యులకు రూ.46.83కోట్లు మంజూరు కానుంది.
- పట్టణ ప్రాంతంలోని 6407 సంఘాల్లో 65,385మంది సభ్యులకు రూ.11.19కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది.

వడ్డీకి అర్హులు ఎవరంటే ?

- 2022-23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదాలు చెల్లించిన అన్నీ సంఘాలకు సున్నా వడ్డీ లభిస్తుంది. సంఘం అప్పు నిల్వలో రూ.3లక్షల వరకు మాత్రమే వర్తిస్తుంది.
- క్యాష్ క్రెడిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతి నెలా, గత నెలాఖరునాటికి ఉన్న అప్పు నిల్వలో కనీసంగా మూడు శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలి.
- టర్మ్ లోన్ అయితే ఏ నెలలో ఎంత ఈఎంఐ చెల్లించారో అంత ఆ నెలాఖరునాటికి చెల్లించి ఉండాలి.
- వైఎస్సార్ సున్నా వడ్డీ అర్హతను ప్రతి నెలా ధ్రువీకరించి చెల్లిస్తారు.
- వాయిదా బకాయి ఉన్న సంఘాలు పూర్తిగా చెల్లించిన తర్వాతే అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆ నెలకు మాత్రమే సున్నా వడ్డీ పొందుతారు.
- ప్రస్తుత అప్పు నిల్వ, అప్పు మంజూరైన మొత్తానికి సమానంగా లేక తక్కువగా ఉన్న సంఘాలు మాత్రమే అర్హత పొందుతాయి.

పథకం అమలు విధానం ఇలా..

వైఎస్సార్ సున్నా వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా స్వయం సహాయ సంఘాల అప్పు ఖాతాలకు జమ చేస్తుంది. ఒక వేళ అప్పు ఖాతా ముగిస్తే సంఘ పొదుపు ఖాతాకు జమ చేస్తారు.

వడ్డీ తగ్గింపు ఇలా..

స్వయం సహాయ సంఘాల బాగు కోరిన ముఖ్యమంత్రి బ్యాంకర్లతో మాట్లాడి రుణంపై వడ్డీ రేట్లను 13.50 శాతం నుంచి 9.50శాతానికి తగ్గించారు. దీని వల్ల చాలా సంఘాలు తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకున్నాయి. తద్వారా సంఘ సభ్యులు ఆర్థిక పరిపుష్టిని సాధించారు. చిన్న తరహా వ్యాపారాలు మరింత లాభదాయకంగా, వడ్డీ భారం లేకుండా నడిచేందుకు, మెరుగైన జీవనం సాధించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ఎంతగానో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు.

డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళల సాధికారత కోసం ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సున్నా వడ్డీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. చాలా మంది మహిళలు వడ్డీ లేకుండా కేవలం పెట్టుబడి సహాయంతో వ్యాపారాల్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. పేద మహిళల ఆర్థిక పురోగతికి వడ్డీ మాఫీ ఉపయోగపడుతుంది.

– బాలూనాయక్, డీఆర్‌డీఏ పీడీ

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సున్నా వడ్డీ పథకం అమలు చేయడం చాలా సంతోషం. కేవలం పెట్టుబడి ద్వారానే ఆర్థిక భారం లేకుండా చిరు వ్యాపారం చేసుకోగలుగుతున్నాం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు.

--పి.కృష్ణకుమారి, సాయి మహిళా డ్వాక్రా గ్రూపు, రామిరెడ్డిపేట, నరసరావుపేట

ఆరోగ్య సమాజానికి క్రీడలు దోహదం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- ముగిసిన జీఎస్ఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలు


జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథితో బ్యాడ్మింటన్ విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): భావితరాలు ఆరోగ్యంగా జీవించాలంటే తల్లిదండ్రులు వారి పిల్లల్ని క్రీడా సాధనవైపు ప్రోత్సహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. గత మూడు రోజుల నుంచి జీఎస్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో నిర్వహిస్తున్న గుజ్జుల సుధాకరరెడ్డి మెమోరియల్ బాలబాలికల అండర్-13, 15, 17 తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ అకాడమీలు క్రీడల్ని ప్రోత్సహిస్తూ పోటీల్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీఎస్ఆర్ అకాడమీ సీఈవో డాక్టర్ కె.సావిత్రి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి అనుక్షణం క్రీడాభివృద్ధికే కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్ని ఏర్పాటు చేసి చిన్నారుల్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణల నుంచి 560 మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల నిర్వహణకు ఎందరో సహాయ,సహకారాలందించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిన్నారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, ఆర్టీఏ కమిషనర్ శామ్యూల్ జొనాథన్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, మేరుగ విజయలక్ష్మి, టోర్నమెంట్ కార్యదర్శి సీహెచ్. విల్సన్ బాబు, కె.ఓంకార్, ఫణిదీప్, వెంకట కృష్ణ బహుమతులు అందజేశారు.

ఏపీటీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎస్ఎం. సుభాని

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం. సుభాని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ (ఏపీటీఈఏ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రమేష్ పర్యవేక్షణలో విజయవాడలో శనివారం సంఘం సర్వసభ్య సమావేశంతో పాటు అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో తాను అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శి సామా సుబ్బారావు (మైనంపాడు డైట్ లెక్చరల్) కోశాధికారి డాక్టర్ రాజాబాలాజీరావు (మైనంపాడు డైట్ లెక్చరల్)తో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా డైట్ కళాశాలల్లో లెక్చరర్ల ఖాళీల భర్తీకి, 91 మంది సీనియర్ లెక్చరర్ల పదోన్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

శివాలయం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అమ్మిశెట్టి

పెదకాకాని: శివాలయంలో దాతల సహకారంతో అభివృద్ధి పనులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రతి సంవత్సరం దాతల సహకారంతో ఘనంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రావణమాసంలో అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవల్ని , గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్లకు నిత్య కల్యాణం సేవల్ని ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. శ్రావణమాసంలో సహస్ర చండీయాగం చేయాలని తీర్మానించారు. చివరిగా జూలై మాసం జమా ఖర్చులు, భక్తుల సౌకర్యాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కొమ్మూరి శివరత్నాలు, కారంకి శివనాగేశ్వరమ్మ, చీడిపూడి అరుణ, కాట్రోత్ పార్వతి, మందాళ జ్యోతి, తోట రవీంద్ర, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ల వెంకటరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చుండూరు అమరవీరులకు నివాళి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న భాస్కరరావు

చీరాల రూరల్: ఏపీ సమతా సైనిక్ దళ్, చీరాల దళిత యువత ఆధ్వర్యంలో చుండూరు అమరవీరుల సంస్మరణ సభ ఆదివారం రాత్రి స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు ఇచ్చినప్పటికీ వాటిని కొంతమంది కాలరాస్తూ హరించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులందరూ ఐకమత్యంతో ఉంటూ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు భాస్కరరావు, గోపతోటి బాబూరావు, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, జాలాది మోహన్, పట్టణంలోని అన్ని దళిత వాడల నుంచి పెద్దసంఖ్యలో యువకులు, అంబేడ్కరిస్టులు హాజరయ్యారు.

పల్నాడు జిల్లా జూడో జట్లు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా జూనియర్, సీనియర్ బాలబాలికల జూడో జట్లు ఎంపిక పోటీల్ని ఆదివారం సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 63మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. జూనియర్ బాలుర విభాగంలో సీహెచ్.కొర్నెల్, షేక్ మునాఫ్, జి.ధర్మతేజ, డి.సంజయ్, ఏ.ఆనంద్, షేక్ మస్తాన్, బాలికల విభాగంలో ఏ.అనూరాధ, అమ్ములు, వి.అఖిల జట్టులో స్థానం సాధించారు. సీనియర్ బాలుర విభాగంలో శివకుమార్, ఆలీ, ఎస్.కె.ఆర్.సలీం, ఎస్.ప్రసన్నాంజనేయులు, సంతస్, బాలికల విభాగంలో మధుమతి, పి.సునీతవాణి, ఎస్.శిరీష ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 12 నుంచి 15వ వరకు నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ బాలబాలికల జూడో చాంపియన్‌షిప్-2023 పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.సాయిరామ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కె.చంద్రశేఖరరెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.ఎం.కమల్ బాషా, సీఈవో పి.రాంబాబు, కోశాధికారి షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.సాయిరామ్, ఓ.శివకృష్ణ, పి.సునీత, జాఫర్, నాగూర్ వ్యవహరించారు.

లోకేశ్ పాదయాత్రకు తగ్గిన ఆదరణ

నగదు, మద్యం ఇచ్చి వేరే ప్రాంతాల నుంచి ప్రజల తరలింపు


డబ్బులు ఇస్తే పాదయాత్రకు వచ్చామని చెబుతున్న యువకుడు

వినుకొండ(నూజెండ్ల): నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు స్పందన తగ్గుతుండటంతో డబ్బులు, మద్యం ఆశ చూపి ఇతర ప్రాంతాల నుంచి ప్రజల్ని తరలించారు. వినుకొండ నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు జరిగిన పాదయాత్ర ఈపూరు, బొల్లాపల్లి మండలాల మీదుగా ఆదివారం కారంపూడి చేరుకుంది. అయితే, పాదయాత్రలో జనం తక్కువగా ఉండటంతో నారా లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బొల్లాపల్లి, పుల్లలచెరువు ప్రాంతాల నుంచే కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి వాహనాల్లో పలువురిని తరలించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొంతమంది యువకులు రూ.500తో పాటు మద్యం, బిర్యాని ప్యాకెట్లు, తెలుగుదేశం పార్టీ టీషర్ట్, కండువాలు ఇస్తే పాదయాత్రకు వచ్చామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డబ్బులు ఇచ్చారని సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేశారు. దీంతో లోకేశ్ పాదయాత్ర ప్రజాదరణపై సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తుండటం గమనార్హం.

ముగిసిన నారా లోకేష్ పాదయాత్ర

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గంలో ఆదివారంతో నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగిసింది. ఆగస్టు 1న నూజెండ్ల మండలం ముప్పరాజుపాలెం వద్ద ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నూజెండ్లలో కొనసాగిన అనంతరం 3న వినుకొండలో బహిరంగసభ నిర్వహించారు. 4న విరామం ప్రకటించారు. 5న ఈపూరు మండలం వనికుంట నుంచి ప్రారంభమై బొల్లాపల్లి మండలం జయంతి రామపురం చేరుకుంది. 6న సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి ప్రారంభమై మేళ్లవాగు మీదుగా మాచర్ల నియోజకవర్గం కారంపూడి శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ వద్దకు సాయంత్రం ఆరు గంటలకు చేరుకుంది. ఎటువంటి పరామర్శలు లేకుండానే లోకేష్ పాదయాత్ర ముగియడం గమనార్హం.

ఆస్తి కోసం అత్త హత్య

- 75త్యాళ్లూరులో ఘాతుకం
- కొంతకాలంగా భార్య, అత్తను వేధిస్తున్న అల్లుడు
- దాడి నుంచి తప్పించుకున్న భార్య
- పోలీసుల అదుపులో నిందితుడు ?


సంఘటన స్థలంలో విచారిస్తున్న సీఐ వీరాస్వామి


మృతురాలు చాంద్‌బీ(ఫైల్)

పెదకూరపాడు: ఆస్తి కోసం అల్లుడు అత్తను హతమార్చిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ వీరాస్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 75త్యాళ్లూరు గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బీ (48) కుమార్తె షకీలాను ఎనిమిదేళ్ల కిందట గుంటూరులోని రామిరెడ్డితోటలో నివాసం ఉంటున్న బైక్ మెకానిక్ షేక్ మాబు సుభానికి ఇచ్చి వివాహం చేసింది. భర్త చనిపోవడంతో ఏడాది నుంచి కుమార్తె దగ్గరే గుంటూరులోని ఉంటోంది. ఆమె పేరుపై 2.16 ఎకరాల పొలం, 11 సెంట్ల ఇళ్ల స్థలం ఉంది. దాన్ని తన పేరుపై రాయాలని నాలుగు నెలల నుంచి మాబు సుభాని భార్య షకీలాను, అత్త చాంద్‌బీని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లీకుమార్తెలు నాలుగు రోజుల నుంచి సొంత గ్రామమైన 75త్యాళ్లూరులో నివాసం ఉంటున్నారు. తరుచూ అక్కడకు సుభాని వచ్చి భార్యను, అత్తను ఆస్తి రాయాలని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పూటుగా మద్యం తాగి ఇంటిలోకి ప్రవేశించి భార్యపై దాడికి ప్రయత్నించాడు. ఆమె ఇద్దరు పిల్లల్ని తీసుకుని కేకలు వేసుకుంటూ బయటకు పారిపోయింది.ఈ క్రమంలో ఇంటిలో ఉన్న గడ్డ పొలుగును తీసుకొని అత్తపై సుభాని కిరాతకంగా దాడి చేశాడు. మొహంపై గాయంతో తీవ్ర రక్తస్రావం అయిన చాంద్‌బీ అక్కడక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరాస్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేత మల్లేశ్వరరావు

గుంటూరు వెస్ట్(క్రీడలు): లీలావతి మెమోరియల్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేతగా జె.మల్లేశ్వరరావు నిలిచారు. ఆదివారం స్థానిక గార్డెన్స్‌లోని గొంది సీతారామయ్య హాల్‌లో నిర్వహించిన పోటీల్లో డి.ధృవేష్, వి.మోహిత ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. అండర్-15 బాలికల విభాగంలో ఎం.వైష్ణవి కార్తీక, వెటరన్ విభాగంలో జి.ప్రసాదరావు గెలుపొందారు. అనంతరం విజేతలకు బహుమతులను ఆడిటర్ డి.శ్రీనివాసరావు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు సీహెచ్. రవీంద్ర రాజు అందజేశారు.